# వరుణుడి జాడేది..


వాడు ముఖం పడుతున్న ప్రొద్దుతిరుగుడు


కె.సుగుమంచిపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంట

**వర్షం వస్తుందన్న నమ్మకంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ, కొర్ర, కంది, ఆముదం, పత్తి, సోయచిక్కుడు తదితర పంటలను వేశారు. కురిసిన కొద్దిపాటి వర్షానికే పంటలను సాగుచేశారు. వస్తుందన్న వర్షం అప్పుడప్పుడు సిరిజల్లులు కురుస్తూ రైతులలో ఆశలు రేపేవి. అయితే ఒక్కసారికూడా పదును వర్షం కురవకపోవడంతో వేసిన పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.**

**కొండాపురం** : మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తదితర పంటలను సాగుచేశారు. ప్రస్తుతం ఆశించిన మేర వర్షం కురవలేదు. భూమిలో రోజురోజుకు తేమ శాతం తగ్గుతుండటంతో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు పదును వర్షం పడలేదు. దీంతో కొందరు రైతులు పంట సాగుచేయాలా వద్దా అని సందిగ్ధంలో పడ్డారు. 2022 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 2,871 హెక్టార్లు సాగుచేయగా, 2023లో 1,155 హెక్టార్లు, 2024లో 690 హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేశారు. దీంతో రెండేళ్లనుంచి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు సాగు చేయడంలో విస్తీర్ణం తగ్గింది. దాదాపు నెలరోజుల నుంచి మేఘాలు కమ్ముకొన్నా, రెండు తుఫానులు వచ్చానా తుంపరేకాని ఒక్కపదునైనా వర్షం కురవలేదు. రైతులు సాగుచేసిన పంట కూడా ఎదుగూబొదుగూ లేక ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు ఒక ఎకరా సాగుకు రూ.20 వేలు ఖర్చు చేశామంటున్నారు. పంట చేతికి రాకపోతే అప్పులే మిగులుతాయంటున్నారు.

### వర్షం కోసం ఎదురు చూస్తున్నాం



పంటసాగుకు తగిన నీరు అందుబాటులో లేనందున అడపదడప పడిన వర్షంకు 20 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. వర్షాకాలం సీజన్ కాబట్టి వర్షాలు వస్తాయని ఆశతో సాగు చేశాను. దాదాపు నెలరోజుల నుంచి పదును వర్షం కురవలేదు. పంట వాడుముఖం పడుతోంది. వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నాం.

**- పాప్పసాని గంగిరెడ్డి, కె.సుగుమంచిపల్లె**

### విత్తుకొనేందుకు ఇంకా అవకాశం



కంది, ఆముదం పంటసాగు చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉంది. వర్షాలు కురిస్తే పంటసాగు 20 శాతం పెరిగే అవకాశం ఉంది. వర్షభావ పరిస్థితుల్లో ఉన్న పైర్లకు యూరియా ఒక లీటర్ నీటికి 20 గ్రాముల చొప్పున ఉదయం లేదా సాయంత్రం వేళలో పిచికారి చేసినట్లయితే కొన్ని రోజుల వరకు వర్షభావ పరిస్థితునుంచి పైర్లను కాపాడుకోవచ్చు.

**- ఏ.వి.రామంజులరెడ్డి, మండల వ్యవసాయ అధికారి**

## రైతుబజార్ ప్రారంభానికి ఈఓ మోకాలడ్డు

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్**


రైతుబజార్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

**వేంపల్లె** : వేంపల్లె గ్రామపంచాయతీ ఈఓ వల్ల వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా మారిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు రైతులతో కలసి రైతు బజార్ ఎదుట మూతులకు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడిన రైతు తను పండించిన పంటను దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకు అమ్ముకోవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు వెచ్చించి రైతుబజార్‌ను నిర్మించిందన్నారు. అయితే వేంపల్లె గ్రామపంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి గేట్ కంట్రాక్టర్‌తో లాలూచి పడటం వల్ల రైతుబజార్ ప్రారంభానికి నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. వేంపల్లె పట్టణం కడప రోడ్డులో ప్రవేటు కల్యాణ మండపంలో ఎలాంటి అసౌకర్యాలు లేకున్నా నేలమీద, కంకరమీద రైతులు కూరగాయలు అమ్ముతున్నారన్నారు. ఇక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. పట్టణ నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో ఉన్న రైతుబజార్లో విక్రయాలు సాగిస్తామని రైతులు అడిగితే మీరు ఎక్కడికి వెళ్లినా పంచాయతీకి డబ్బులు చెల్లించాల్సిందే అని గేట్ కాంట్రాక్టర్ తొక్కిపెడుతున్నాడన్నారు. ఈఓ సుబ్బారెడ్డి సాంకేతిక కారణాలు చూపుతూ అడ్డుపడుతుండటంతో పులివెందుల ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డితో చెప్పించినా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రైతులు, ప్రజల అవసరాల దృష్ట్యా వేంపల్లె గ్రామ పంచాయతీ ఈఓ మీద, వేంపల్లె రైతుబజార్‌పై దృష్టి సారించి రైతులకు వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, బీజేపీ కోరుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణా జలాలను వెంటనే విడుదల చేయాలి

**పులివెందుల రూరల్** : కృష్ణాజలాలను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నూరుబాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ రసూల్ కోరారు. ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అచ్చవెల్లి, ఎర్రిపల్లె, వేముల మండలంలోని ముత్తుకూరు, నల్లచెరువుపల్లె, రామిరెడ్డిపల్లె, గొందిపల్లె, కొత్తపల్లె గ్రామాలలో వర్షాదారం కింద ఆదారపడి పంటలు సాగు చేసిన రైతులు చాలా మంది ఉన్నారన్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోతున్నందువల్ల సంబంధిత అధికారులు స్పందించి పంట కాలువలకు, ఉప కాలువలకు వెంటనే నీటిని విడుదల చేయాలని రైతుల పక్షాన కోరుతున్నామన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు.

### నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల టౌన్** : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకర్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరయ్యారు. నూతన వధూవరులు అశోక్‌కుమార్‌రెడ్డి, సుధాతేజస్విలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డిలు ఆశీర్వదించారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**పులివెందుల రూరల్** : పట్టణంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. 33–11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌పార్మర్ల మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబకపల్లె రోడ్డు, పాల్‌రెడ్డి పంక్షన్ హాలు, తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్య ప్రదర్శనలో చిన్నారులు


గ్రూప్‌డ్యాన్స్‌లో చిన్నారులు

**పులివెందుల టౌన్** : పట్టణంలోని ఉలిమెల్లరోడ్డులో ఉన్న వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాయంత్రం సండే సందడి కనువిందుచేసింది. విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ నాగార్జున పాఠశాల చిన్నారులు మాస్టర్ చిట్టి, చందన ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సందర్శకులను ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సందర్శకుల కేరింతలతో ఆ ప్రాంతమంతా సందడి కళ కనిపించింది. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్, పాఠశాల కరస్పాండెంట్ గీత, ఇన్‌చార్జి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనంతోనే కాలుష్య నివారణ


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

**ఎర్రగుంట్ల** : పట్టణంలో కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చదనం అవసరమని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 320 మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రామాంజనేయరెడ్డి, మానవత చైర్మన్ రఘురామిరెడ్డి, పట్టణ సీఐ నరేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించండి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

**పులివెందుల రూరల్** : పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం మెనూ సరిగా లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ వసతి గృహంలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వసతి గృహాలలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువతకు శిక్షణ

**కడప కోటిరెడ్డిసర్కిల్** : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయసు కలిగి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాసై లేదా ఫెయిల్ వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజులపాటు బెంగళూరు నగరంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 90004 87423 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

## చౌకబారు విమర్శలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

**కమలాపురం** : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిపై స్థానిక టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా తదితరులు చేసే చౌకబారు విమర్శలు మానుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి హితవు పలికారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేపై స్థానిక టీడీపీ నాయకులు వారిస్థాయి మరిచి విమర్శలు చేయడం హాస్యాస్పదం అన్నారు. కమలాపురం నగర పంచాయతీలో గతంలో ఎన్నడూలేని విధంగా వందల కోట్ల రుపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వాటి గురించి అవగాహన లేని టీడీపీ నాయకులు అభివృద్ధి జరగలేదని చౌకబారు ప్రకటనలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు ఈ రెండు నెలల కాలంలో డ్రైనేజీ పూడిక తీయడం, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన చిరుద్యోగుల పొట్ట కొట్టడం తప్పా మీరేమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో కమలాపురం పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హాస్పిటల్, పాలిటెక్నిక్ కళాశాల భవనం, ఆర్టీసీ బస్టాండు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు, మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించిన సంగతి మీకు తెలియదా? అని ప్రశ్నించారు. రూ.67కోట్ల నిధులతో నగర ప్రజలకు మంచి నీరు అందించాలన్న లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే ట్యాంకులను నిర్మిస్తుంటే వాటి నిర్మాణాలు ఆపి పట్టణ ప్రజలకు శుద్ధ జలం అందకుండా చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఈ రెండు నెలల కాలంలో మీరు డ్రైనేజీలలో పూడిక తీయడం అభివృద్ధి అనుకుంటే అది మీ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. నెలా నెలా ఆనవాయితీగా ఇచ్చే వృద్ధాప్య పింఛన్లు తప్పా చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ దాక్కున్నాయో తెలపాలన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతును అధికార బలంతో నొక్కాలనుకోవడం ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి నీకు ఉందో లేదో ఆత్మ విమర్శ చేసుకోవాలని వారు హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండారెడ్డి, ఖాజా హుసేన్, గౌస్ మున్నా, గౌస్ మోహీన్, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి సాగుపై రైతుల ఆసక్తి


సాగులో ఉన్న ఉల్లిపంట


ఉల్లి సాగుకై నీటి తడులు

**పెద్దముడియం** : మండలంలోని పెద్దపసుపుల గ్రామ రైతులు ఉల్లి పంటసాగుపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామానికి సంబంధించి 12000 ఎకరాలు సాగు భూమి ఉండగా రైతులు సాంప్రదాయ పంటలైన జొన్న, శనగ పంటలను సాగు చేస్తున్నారు. దిగుబడులు అంతంతమాత్రం రావడం, ధరలు కూడా లేకపోవడంతో గత సంవత్సరం ముగ్గురు రైతులు ప్రయోగాత్మకంగా ఉల్లి పంటను సాగు చేసి మంచి లాభాలను చూశారు. దీంతో ఈ సంవత్సరం మరి కొందరు రైతులు పంటను ఇప్పటికే సాగు చేశారు. వర్షాలు పడకపోవడంతో మైలవరం జలాశయం నుంచి నీరు కాలువలకు వదిలితే మరికొందరు రైతులు ఉల్లి పంటను సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నారు.

## సోదర సౌభ్రాతృత్వానికి ప్రతీక రక్షాబంధన్



ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి, కలమల్ల ఎస్ఐ తిమోతికి రాఖీ కడుతున్న ఓంశాంతి నిర్వాహకులు

**ఎర్రగుంట్ల** : సోదర, సౌభ్రాతృత్వానికి ప్రతీక రక్షాబంధన్ అని ఆర్టీపీపీ ఓంశాంతి భవన్ నిర్వాహకులు సౌజన్య తెలిపారు. ఆదివారం రాఖీపౌర్ణమి పండుగను పురస్కరించుకుని ముందుగానే రక్షాబంధన్ పండు వేడుకలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి, కలమల్ల ఎస్ఐ తిమోతికి, ఆర్టీపీపీ ఎస్ఈ దేవేంద్రనాయక్‌కు, ఎస్‌పీఎఫ్ డీఎస్పీకి, ఇతర అధికారులకు రాఖీలు కట్టారు.

## విద్యుత్ ఉద్యోగులపై దాడులు ఆపాలని వినతి


డీఎస్పీ మురళీనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**పులివెందుల రూరల్** : పట్టణంలోని విద్యుత్తు ఉద్యోగులపై ఎస్ఐ అనిల్‌కుమార్ దాడిచేశారని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌కు విద్యుత్తు శాఖ అధికారులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. విధులు ముగించుకుని వస్తున్న గురురాజు, మహమ్మద్‌షఫీలను ఎస్ఐ విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీలు, ఏఈలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కేరళ వరద బాధితులను ఆదుకోవాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్** : కేరళ వరద బాధితులను ఆదుకోవాలని ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి అన్నారు. ఆదివారం కడప నగరంలోని కళాక్షేత్రం నుంచి వైవీ స్ట్రీట్‌లో ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా విరివిగా ఆర్థిక సహకారం అందజేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను వారికి అందజేస్తామని ప్రకటించారు. తారక రామారావు, నరసింహ, అంకుశం, సుబ్బారాయుడు, పుల్లయ్య, రామాంజనేయులు, వెంకటాద్రి, జనార్ధన్ పాల్గొన్నారు

# అతివలు అదుర్స్

- ఫొటోగ్రఫీలో రాణిస్తున్న అమ్మాయిలు
- కడప నగరంలో శిక్షణ
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఫొటో టేకింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**కడప కల్చరల్** : ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ రంగంలో మహిళలు ఉండటం చాలా తక్కువ. పెద్ద నగరాల్లో మాత్రమే ఒకరిద్దరు మహిళా ఫొటోగ్రాఫర్లు కనిపిస్తారు. వారసత్వంగా కూడా మహిళలు ఈ రంగంలోకి రావడం అరుదు. అలాంటి తరుణంలో కడప నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫొటోగ్రఫీలో సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అవసరమైన మేరకు శిక్షణ ఇస్తున్నారు. వారు ఈ రంగంలో నిలదొక్కుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అందిస్తున్న కథనం.

కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్)లోని ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ మార్తల గురుమోహన్‌రెడ్డికి ఫొటోగ్రఫీపై మక్కువ ఎక్కువ. దీంతో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఏడాది పాటు సర్టిఫికెట్ కోర్సు చేశారు. ఈ రంగంలో ఎక్కడ ఎవరు శిక్షణ ఇస్తున్నా వెళ్లి అందులోని నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నారు. లైటింగ్, ప్రకృతిలోని సహజత్వంలను కలిపి ఫొటోలను తీస్తుంటారు. అవసరమైన లైంటింగ్ కోసం ఐదారు గంటలు వేచి చూస్తారు. మంచి యాంగిల్, స్పష్టత దొరికినంత వరకు వదలరు. దీన్ని గమనించిన పలువురు భావితరాలు ఈ రంగంలో కొనసాగేందుకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. దాంతో ఆయన తన కళాశాలలోని చురుకైన అమ్మాయిలను ఎంపిక చేసుకుని అధికారుల అనుమతితో వారికి ఫొటోగ్రఫీలో సంవత్సరం పాటు సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికి 50 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బ్యాచ్‌లో 30 మంది శిక్షణ పొందుతున్నారు. అమ్మాయిలంతా ఎంతో చురుగ్గా, సమయస్ఫూర్తి ప్రదర్శిస్తూ తమదైన క్రియేటివిటీతో ఫొటోలను తీస్తుండడం అందరినీ అబ్బురపరుస్తోంది. గురువు గురుమోహన్‌రెడ్డి కూడా ఖరీదైన ఎక్విప్‌మెంట్‌ను సేకరించి ఆధునిక ఫొటోగ్రఫీలోని నైపుణ్యాలను వారికి అందేలా కృషి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మహిళా ఫొటోగ్రాఫర్లు ఉన్నారంటే వారు తప్పకుండా గురుమోహన్‌రెడ్డి శిష్యులే అయి ఉంటారు. ప్రస్తుతం వీరిలో శ్వేతతోపాటు మరో నలుగురైదుగురు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లుగా కొనసాగుతున్నారు.


కెమెరాలతో ఫొటోగ్రఫీ విద్యార్థినులు

## క్లుప్తంగా

### ఘనంగా అమ్మవారికి పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

**చింతకొమ్మదిన్నె** : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను పరిశీలించి అందుబాటులో ఉంచారు. భక్తులు అమ్మవారికి కానుకలను సమర్పించుకున్నారు. ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో భోజనాలను చేశారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, ఆంజనేయస్వామి, అక్కదేవతలు, వీరభద్రస్వామి, వైద్యనాధేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నేడు వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట


ధ్వజస్తంభ పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

**సింహాద్రిపురం** : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట స్థాపన పూజలు నిర్వహించారు. తిరుపతి, బెంగళూరుకు చెందిన వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీహోమం, వాస్తు హోమం, మధ్యాహ్న సమయంలో స్వామివారి విగ్రహ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.

### డెంగీ వ్యాధిపై అవగాహన


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

**లింగాల** : స్థానిక ప్రభుత్వ సాంఘీక సంక్షేమ ఎస్సీ వసతి గృహంలో ఆదివారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య విద్యార్థులకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో వసతి గృహాలలోని విద్యార్థులు సాయంత్ర 5 గంటలకు కిటికీలు, తలుపులు మేసి ఉంచాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే ఆసుపత్రులకు వెళ్లి వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, వార్డెన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అక్కినేని నాగేశ్వరరావు జయంతి


సత్కారం అందుకుంటున్న సాయిప్రసాద్

**పులివెందుల టౌన్** : సినీనటుడు ప్రముఖ డాక్టర్ అక్కినేని జయంతి వేడుకలను కడప కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు సీనియర్ అభిమానులను సత్కరించారు. పులివెందులకు చెందిన సీనియర్ అభిమాని గాజుల సాయిప్రసాద్‌ను ప్రముఖుల చేతు మీదుగా శాలువతో ఘన సత్కారం చేశారు.

### వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


పిల్లలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

**జమ్మలమడుగు** : ప్రజలు ఉచిత మెగా వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ తెలిపారు. ఆదివారం దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక రిపబ్లిక్ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.